క్లుప్తంగా

ఘనంగా భూలోకమాత పండగ



ప్రత్యేక అలంకరణలో భూలోకమాత

తగరపువలస: ఆనందపురం జెడ్పీ హైస్కూల్ చేరువలో ఉన్న భూలోకమాత అమ్మవారి పండగ ఆదివారం ఘనంగా జరిగింది. ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం వరకు అమ్మవారికి స్థానికులు పసుపు కుంకుమలు సమర్పించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. వీధుల్లో అమ్మవారి ఊరేగింపు వైభవంగా నిర్వహించారు. ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఆనందపురం సీఐ టీవీ తిరుపతిరావు, ఎస్‌ఐ సంతోష్ ఆధ్వర్యంలో పోలీసులు చర్యలు చేపట్టారు. ఉత్సవ కమిటీలు భక్తులకు తాగు నీరు, క్యూ లైన్లు ఏర్పాటు చేశాయి.

నేడు తిరుమంజన హోమం

కొమ్మాది: భీమిలి బీచ్ రోడ్డు వారిజ ఆశ్రమంలోని హయగ్రీవ మందిరంలో శ్రావణ పూర్ణిమ శ్రీ లక్ష్మీ హయగ్రీవ జయంతి సందర్భంగా సోమవారం తిరుమంజనం (అభిషేకం) హోమం, కవచ అలంకరణ, ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆశ్రమ నిర్వాహకులు శ్రీకాంతాచార్యులు తెలిపారు. కార్యక్రమం ఉదయం 7.30 గంటలకు ప్రారంభం కానున్నట్లు పేర్కొన్నారు.

కుక్కల దాడిలో ఒకరికి తీవ్రగాయాలు

తగరపువలస: ఆనందపురం మండలం లొడగలవానిపాలెం పంచాయతీ నేలతేరులో ఆదివారం బంక అప్పలనాయుడు అనే వ్యక్తిని వీధి కుక్కలు తీవ్రంగా గాయపరిచాయి. మామిడి కొమ్మలు తీసుకురావడానికి వెళ్లిన అతనిపై కుక్కలు దాడి చేయడంతో, క్షతగాత్రుడికి ఆనందపురం పీహెచ్‌సీలో చికిత్స చేశారు.

ఆవుదూడ మృతి



భీమిలి మండలం లక్ష్మీపురం పంచాయతీలో లచ్చుబుగత రమణకు చెందిన ఆవుదూడ కుక్కలదాడిలో ఆదివారం మృతి చెందింది. ఇటీవల ఇదే పాడి రైతుకు చెందిన రెండు దూడలు కూడా కుక్కలదాడిలో మృతి చెందాయి. పంచాయతీలో తరచూ కుక్కల దాడులతో పశువులు మృతి చెందుతున్నా అధికారులు స్పందించడం లేదని బాధిత రైతు వాపోయాడు. ఇప్పటికైనా కుక్కల నుంచి ఆవులు, మేకల రక్షణకు చర్యలు తీసుకోవాలని పంచాయతీ రైతులు కోరుతున్నారు.

కుక్కలతో బెంబేలు


ఆనందపురం మండలంలో కుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయి. మిగిలిన ప్రాంతాల్లో పట్టుకున్న కుక్కలకు శస్త్రచికిత్సలు చేసి మండలంలో పలుచోట్ల విడిచిపెడుతున్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. వేములవలస కూడలిలో చేపలు, మాంస వ్యర్థాల కోసం పదుల సంఖ్యలో కుక్కలు తిష్ట వేస్తున్నాయి. లొడగలవానిపాలెం, ఆనందపురం, చందక, పొడుగుపాలెం ప్రాంతాల్లో కుక్కల బెడద ఎక్కువగా ఉంది.

అప్పన్న అన్నప్రసాద పథకానికి విరాళాలు

సింహాచలం : శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి ఆదివారం సింహాచలం దరి ప్రహ్లాదపురం ప్రాంతానికి చెందిన మహంతి వెంకటలక్ష్మి లక్ష 116 రూపాయాల విరాళాన్ని, డాబాగార్డెన్స్‌కి చెందిన చెక్కరాజు, ప్రసాద్ కలిసి లక్ష 116 రూపాయల విరాళాన్ని అందజేశారు. సంబంధిత విరాళాలను అన్నప్రసాద విభాగం ఏఈవో పాలూరి నరసింగరావుకి, ప్రోటోకాల్ సీనియర్ అసిస్టెంట్ సూర్యనారాయణకు చెక్కుల రూపంలో అందజేశారు. దేవస్థానం తరపున దాతల కుటుంబాలకు దేవస్థానం అధికారులు దర్శనం కల్పించి ప్రసాదం, శేషవస్త్రం అందజేశారు.

దళితుల భూములపై దళారుల కన్ను

- కుసులవాడలో 47 ఏళ్ల కిందట 43 ఎకరాల కేటాయింపు
- అమాయక దళితులను బురిడీ కొట్టించిన స్థానిక ప్రజాప్రతినిధి భర్త
- కోట్ల రూపాయల విలువైన భూమి కాజేసేందుకు భారీ స్కెచ్



కుసులవాడ పంచాయతీలోని సర్వే నంబర్ 98లో స్థలం



సర్వే నంబర్ 108లోని స్థలం

తగరపువలస : దళితులకు ఇచ్చిన భూములపై దళారుల కన్ను పడింది. కోట్ల రూపాయల విలువ చేసే భూములు కావడంతో వారి నోట్లో మట్టికొట్టేందుకు సిద్ధమయ్యారు. ఆనందపురం మండలం కుసులవాడ పంచాయతీకి చెందిన 43 మంది దళిత రైతుల భూములను కాజేసేందుకు పక్కా స్కెచ్ వేశారు. అయితే వైఎస్సార్‌సీపీకి చెందిన ఒక నాయకుడు దళితులను మేల్కొలిపి వారికి జరుగుతున్న నష్టం గురించి అవగాహన కల్పించడంతో దళారుల ప్రణాళికకు బ్రేక్ పడింది. అధికారుల దృష్టికి తీసుకెళ్లి, న్యాయస్థానాన్ని ఆశ్రయించడంతో ఈ స్థల వివాదం ఇప్పటి వరకు స్తబ్దుగా ఉండిపోయింది. వివరాలిలా ఉన్నాయి.

రూ.7 కోట్ల భూమి కొట్టేసేందుకు..

కుసులవాడ పంచాయతీకి చెందిన 43 మంది దళిత రైతులకు 47 ఏళ్ల క్రితం అప్పటి ప్రభుత్వం 43 ఎకరాల మిగులు భూమి ఇచ్చింది. కుసులవాడ పంచాయతీతో పాటు నీళ్లకుండీలు - విజయనగరం రహదారిని ఆనుకుని ఉన్న ఈ స్థలం మార్కెట్ విలువ ఎకరానికి రూ.7 కోట్లు ఉంటుంది. గతంలో ప్రభుత్వం ల్యాండ్ సీలింగ్ కింద స్వాధీనం చేసుకుని 1977లో పంచాయతీకి చెందిన దళిత పేదలకు ఎకరం వంతున పంపిణీ చేసింది. సర్వే నంబర్ 98, 108లో ఉన్న ఈ భూమికి సంబంధించి లబ్ధిదారుల నుంచి డి.పట్టాలను రెండేళ్ల క్రితం పంచాయతీకి చెందిన ప్రజాప్రతినిధి భర్తతోపాటు మండలానికి చెందిన ఇద్దరు దళారులు కొట్టేయడానికి పక్కాగా స్కెచ్ వేశారు.

ఎకరా రూ.30 లక్షల వంతున అమ్మకానికి..

పంచాయతీకి చెందిన ప్రజాప్రతినిధి భర్తతోపాటు మరో ఇద్దరు దళారులు రైతులను ల్యాండ్ పూలింగ్ పేరుతో ఏమార్చి ఎకరానికి రూ.18.50 లక్షలు ఇప్పిస్తామని వారితో రెండేళ్ల కిందట ఖాళీ పేపర్లపై సంతకాలు చేయించుకున్నారు. డాక్యుమెంట్ల తయారీకి రూ.5 లక్షలు, రైతులకు రూ.13.50 లక్షలు అని ఒప్పించారు. మరోవైపు రైతులకు తెలియకుండా మరొక రియల్ ఎస్టేట్ వ్యాపారికి ఎకరా స్థలాన్ని రూ.30 లక్షల వంతున విక్రయించడానికి ఒప్పందం చేసుకున్నారు. అందులో భాగంగా సదరు వ్యాపారి నుంచి అడ్వాన్సుగా తీసుకున్న డబ్బులో రైతులకు ఎకరానికి రూ.లక్ష నుంచి రూ.3.50 లక్షల వరకు ఇచ్చి, మిగిలిన డబ్బును ఆ ప్రజాప్రతినిధి భర్త రూ.3 లక్షలు తీసుకుని, మరో ఇద్దరికి రూ.లక్ష వంతున వాటాలు అందించాడు. తర్వాత ల్యాండ్ పూలింగ్ పేరుతో ఆ 43 ఎకరాలను ప్రభుత్వానికి అప్పగిస్తే ఎకరానికి 900 గజాల చొప్పున ఇచ్చే స్థలాన్ని దళారులు కాజేసి రియల్ ఎస్టేట్ వ్యాపారి చేతిలో పెట్టాలని ప్లాన్ వేశారు. ఇందులో భాగంగా ఆ స్థలంలోని వెడల్పాటి గెడ్డను సైతం పూడ్చేశారు. ల్యాండ్ పూలింగ్ జరిగితే ఒక్కో రైతుకు ప్రభుత్వం ఇచ్చే 900 గజాల స్థలం విలువ సుమారు రూ.1.35 కోట్లు ఉంటుంది. ఇది వరకే ఖాళీ పత్రాలపై సంతకాలు చేసినందున ఆ 43 ఎకరాలకు ప్రతిఫలంగా వచ్చిన స్థలం దళారుల చేతుల మీదుగా రియల్ ఎస్టేట్ వ్యాపారి చేతికి చేరుతుంది. ఈ మొత్తం వ్యవహారంలో ముందుగా కుదుర్చుకున్న ఒప్పందం ప్రకారం అమాయక దళిత రైతులకు ఒక్కొక్కరికి రూ.13.5 లక్షలు మాత్రమే దక్కుతుంది. అయితే మొత్తం ధరలో ఒక్కో రైతుకు దక్కేది కేవలం పది శాతం మాత్రమే కావడం గమనార్హం. ఈ వ్యవహారంలో దళారులకు మాత్రం కోట్లాది రూపాయలు దక్కుతున్నాయి. దళిత రైతులతో ముందుగా కుదుర్చుకున్న ఒప్పందం... ఆ పత్రాలతో రియల్ ఎస్టేట్ వ్యాపారితో చేసుకున్న ఒప్పందం వల్ల ఒక్కో ఎకరానికి రూ.16.5 లక్షలు వంతున రూ.7 కోట్లు దళారుల జేబుల్లోకి చేరనుంది.

శాశ్వత పట్టాలు జారీ చేయాలి

తమ ఆధీనంలో ఉన్న భూములకు ప్రభుత్వం పట్టాదారు పాస్ పుస్తకాలు, టైటిల్ డీడ్లు ఇవ్వాలని దళితులు విజ్ఞప్తి చేస్తున్నారు. దళితులకు 47 ఏళ్ల క్రితం కేటాయించిన అసైన్డ్ భూములపై దళారీల కన్ను పడకుండా ప్రస్తుత ప్రభుత్వం అమ్మకానికి వీలులేని విధంగా శాశ్వత పట్టాలు జారీ చేయాలని వైఎస్సార్‌సీపీ, వామపక్షాల నాయకులు కోరుతున్నారు. దళారులు కప్పేసిన గెడ్డను పునరుద్ధరించాలని కోరుతున్నారు.

ఇస్కాన్‌లో ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో రాధాకృష్ణులు

కొమ్మాది: సాగర్‌నగర్ ఇస్కాన్ మందిరంలో ఆదివారం వారాంతపు పూజలు కనులపండువగా జరిగాయి. హరేకృష్ణ, హరేరామ నామస్మరణతో ప్రాంగణం మార్మోగింది. రాధాకృష్ణులు, సుభద్ర, బలభద్ర, జగన్నాథుడు, సీతారాములు, ఆంజనేయ, నరసింహస్వామి విగ్రహాలను వివిధ వర్ణాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. స్వామి వారి లీలలు, మహిమలను వర్ణిస్తూ భక్తులు భజనలు, గీతాలాపనలు చేశారు.

తీరంలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

కొమ్మాది: భీమిలి బీచ్ రోడ్డు తిమ్మాపురం తీరం వద్ద ఆదివారం ఉదయం గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం కొట్టుకువచ్చింది. దాసరి రఘురాం అనే వ్యక్తి వాకింగ్ చేస్తుండగా ఈ ప్రాంతంలో తీరం వద్ద నల్ల ప్యాంట్, ఎరుపు, నలుపు గల టీ షర్టుతో (సుమారు 35 నుండి 40 సంవత్సరాలు) వ్యక్తి మృత దేహం కనిపించింది. వెంటనే ఆయన భీమిలి పోలీసులకు ఫిర్యాదు చేయగా, సీఐ డి.రమేష్ సంఘటనా స్థలం చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భీమిలి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

స్మృతుల పరిమళం



పూర్వ విద్యార్థుల కేరింతలతో ఆనందపురం జెడ్పీ హైస్కూల్‌లో సందడి నెలకొంది. నాటి అల్లరిని గుర్తు చేసుకుంటూ స్నేహితులంతా మధురజ్ఞాపకాల్లో మునిగి తేలారు. 2012-13 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న విద్యార్థుల ఆత్మీయ సమావేశం ఉత్సాహంగా సాగింది. ప్రస్తుత ప్రధానోపాధ్యాయుడు కె.రామకృష్ణ పట్నాయక్, అప్పటి ప్రధానోపాధ్యాయుడు రుత్తల సన్యాసిరావుతో పాటు ఉపాధ్యాయులు, విద్యార్థులు అలనాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. కష్టసుఖాలను పంచుకుని, ఒకరికొకరు తోడుగా నిలవాలని నిర్ణయించుకున్నారు. ఉపాధ్యాయులు జాన్ రబ్బీ, శతపతి, రాంప్రసాద్, రాణి మాట్లాడుతూ పూర్వ విద్యార్థులు సమాజసేవలో భాగస్వాములు కావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు ముడసల శ్రీను, మధు, రాజేష్, రాజు, జయరాం తదితరులు పాల్గొన్నారు. - తగరపువలస

జడివాన



జాతీయ రహదారిపై ప్రవహిస్తున్న వర్షపు నీరు

పీఎం పాలెం: ఆదివారం రాత్రి 7 గంటల సమయంలో పీఎం పాలెం పరిసర ప్రాంతాల్లో జడివాన కురిసింది. ఒక్కసారిగా వాతావరణం కారుమబ్బులు కమ్మి కుండపోత వాన కురవడంతో ద్విచక్ర వాహనచోదకులు, పాదచారులు ఇబ్బంది పడ్డారు. కారుషెడ్ కూడలి జాతీయ రహదారిపై వర్షం నీరు ప్రవహించింది. సర్వీస్ రోడ్లలో నీరు నిలిచిపోయింది. హౌసింగ్ బోర్డు కాలనీ, ఆర్‌హెచ్ కాలనీ, గాయత్రీనగర్ తదితర ప్రాంతాల్లోనూ ప్రజలు అకస్మాత్తుగా కురిసిన వర్షంతో అవస్థలు పడ్డారు.

సందడిగా సాగరతీరం

రుషికొండ బీచ్‌లో పర్యాటకుల తాకిడి



సాగర్‌నగర్, రుషికొండ, తొట్లకొండ, భీమిలి బీచ్‌లు ఆదివారం సందర్శకులతో కళకళలాడాయి. సెలవుదినం కావడంతో పాటు ఉదయం నుంచి ఉష్ణతాపం ఎక్కువగా ఉండటంతో ఉపశమనం కోసం సాగరతీరాలకు జనం తరలివెళ్లారు. దీంతో తీరప్రాంతాల్లో సందడి నెలకొంది. – కొమ్మాది

డిసెంబర్‌లో భీమిలి హైస్కూల్ శతాబ్ది ఉత్సవాలు



సమావేశమైన కమిటీ సభ్యులు

భీమునిపట్నం: భీమిలి ప్రభుత్వ ఉన్నత పాఠశాల శతాబ్ది ఉత్సవాలను డిసెంబర్ 14, 15 తేదీల్లో నిర్వహించనున్నట్లు ఉత్సవ నిర్వాహక కమిటీ తెలిపింది. ఆదివారం నిర్వహించిన కమిటీ సభ్యుల సమావేశంలో అధ్యక్ష కార్యదర్శులు గాడు అప్పలనాయుడు, మైలిపల్లి లక్ష్మణరావు మాట్లాడారు. వంద సంవత్సరాల చరిత్ర కలిగిన పాఠశాలలో తామందరం పూర్వ విద్యార్థులు కావడం గర్వంగా ఉందన్నారు. అందుకే కమిటీగా ఏర్పడి శతాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో పైలాన్, సరస్వతీ దేవి విగ్రహాలను ఆవిష్కరించనున్నట్లు తెలిపారు. ఉత్సవాల నిర్వహణకు ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు సహకారాన్ని తీసుకోనున్నామని, కార్యక్రమానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, విద్యాశాఖ మంత్రి లోకేష్‌ను ఆహ్వానిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు ఎం.వి.పార్వతీశం, మైలిపల్లి షణ్ముఖరావు, కాళ్ల సన్నీ, కె.ముత్యాలరావు తదితరులు పాల్గొన్నారు.

బీచ్‌లో బెంచీలు ధ్వంసం



ధ్వంసం అయిన బెంచీలు

కొమ్మాది: భీమిలి బీచ్ రోడ్డు రామాద్రి బీచ్, తొట్లకొండ బీచ్‌ల వద్ద గతంలో ఏర్పాటు చేసిన బెంచీలను ఆకతాయిలు ధ్వంసం చేస్తున్నారు. పర్యాటకులు సేద తీరేందుకు, అక్కడ కూర్చుని ప్రకృతిని ఆస్వాదించేందుకు అప్పటి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు ఈ బెంచీలను ఏర్పాటు చేశారు. అయితే ప్రస్తుతం అవి విరిగిపోయి ఉండటంతో ఆ అవకాశం ఉండటం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వాటిని పరిరక్షించాలని కోరుతున్నారు.

ఉత్సాహంగా కళానైపుణ్య పోటీలు




పాట్ పెయింటింగ్ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు, ఓ విద్యార్థిని తయారు చేసిన కళాకృతి

కొమ్మాది: శ్రీ కృష్ణ జన్మాష్టమిని పురస్కరించుకుని ఇస్కాన్ మందిరంలో ఆదివారం నిర్వహించిన కళానైపుణ్య పోటీలకు విశేష స్పందన లభించింది. నగరం నలుమూలల్లోని అనేక పాఠశాలల నుంచి వందలాది మంది విద్యార్థులు ఉత్సాహంగా పోటీల్లో పాల్గొన్నారు.

కార్యక్రమాన్ని ఇస్కాన్ అధ్యక్షుడు సాంబదాస్ ప్రభూజీ, మాతాజీ నితాయి సేవిని ప్రారంభించారు. వారు మాట్లాడుతూ ఈ నెల 24 నుంచి 27వ తేదీ వరకు ఇస్కాన్‌లో వైభవంగా జన్మాష్టమి వేడుకలు నిర్వహించనున్నామని, ఈ నేపథ్యంలో విద్యార్థుల కోసం అనేక ఆకర్షణీయమైన పోటీలు నిర్వహించామని తెలిపారు. పాట్ పెయింటింగ్, వ్యాసరచన, డ్రాయింగ్, శ్రీకృష్ణ లీలలపై పరీక్ష, భగవద్గీత శ్లోకాల పారాయణం, వంట, పూల అలంకరణ, రంగోలి తదితర పోటీలు నిర్వహించామని, విజేతలకు కృష్ణాష్టమి నాడు బహుమతులు అందజేస్తామని పేర్కొన్నారు.

ఏడాదిగా ఇంతే..



పేకేరులో ఏడాది క్రితం డ్రైనేజీల నిర్మాణానికి తవ్వి వదిలేసిన గోతులు

తగరపువలస: ఆనందపురం మండలం పేకేరు పంచాయతీలో డ్రైనేజీల నిర్మాణానికి ఏడాది క్రితం తవ్విన గోతులను అలాగే వదిలేయడంతో స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. పంచాయతీకి చెందిన పలువురు తరచూ ఆ గోతుల్లో పడి గాయాలపాలవుతున్నారు. తవ్విన చోట తిరిగి మట్టిపడి, ఆపై వర్షాలు కురుస్తుండటంతో ఈ ప్రాంతాలు ఊబిగా మారుతున్నాయి. రెండు నెలల క్రితం ఇదే పంచాయతీకి చెందిన ఇద్దరు విద్యార్థులు ఈ ఊబిలో చిక్కుకుని విలవిలలాడారు. దీంతో పంచాయతీ ప్రజలు తమ చిన్నారులను కళ్లలో ఒత్తులు వేసుకుని రక్షించుకోవలసి వస్తోంది. తవ్విన గోతుల్లో మురుగునీరు నిల్వ ఉండటంతో దోమలు, ఈగలు వృద్ధి చెంది పలువురు డయేరియా వంటి వ్యాధులబారిన పడుతున్నారు. పంచాయతీలో పరిస్థితులు ఇంత ఘోరంగా ఉన్నా పంచాయతీ, మండల పరిషత్ అధికారులు స్పందించడం లేదని స్థానికులు వాపోతున్నారు. డ్రైనేజీకి సంబంధించిన బిల్లు సమస్యలు పరిష్కరించి, డ్రైనేజీ నిర్మించి సిమెంట్ ప్లేట్లు వేయాలని కోరుతున్నారు.

విలాస్కాన్‌పాలెంలో పని చేయని 'బీఎస్‌ఎన్‌ఎల్'

ఫిర్యాదు చేసినా స్పందించని సిబ్బంది

తగరపువలస: పద్మనాభం మండలం విలాస్కాన్‌పాలెం పంచాయతీలో బీఎస్‌ఎన్‌ఎల్ బ్రాడ్‌బాండ్ సేవలు దయనీయంగా ఉన్నాయని వినియోగదారులు వాపోతున్నారు. నెలకు రూ.600 వంతున సేవలకు రుసుం చెల్లిస్తున్నా సగం రోజులు కూడా నెట్‌వర్క్ పనిచేయడం లేదని అంటున్నారు. గత నెలలో ఫైబర్ నెట్‌వర్క్, ప్రైవేట్ నెట్‌వర్క్ చార్జీలు పెరగడం, పలు ప్రాంతాల్లో బీఎస్‌ఎన్‌ఎల్ కొత్త టవర్లు అందుబాటులోకి రావడంతో చాలామంది వినియోగదారులు బీఎస్‌ఎన్‌ఎల్‌కు మారుతున్నారు. ఈ క్రమంలో పద్మనాభం మండలంలో సేవలకు కలిగే అంతరాయానికి సిబ్బంది స్పందించడం లేదంటున్నారు. ముఖ్యంగా విలాస్కాన్‌పాలెంలో వినియోగదారులు బీఎస్‌ఎన్‌ఎల్ కస్టమర్ కేర్ సెంటర్‌కు ఫోన్ చేస్తున్నా థాంక్యూ, ధన్యవాదాలు అంటూ ముగిస్తున్నారని వాపోతున్నారు. ఇప్పటికైనా ఉన్నతస్థాయి అధికారులు స్పందించి మెరుగైన సేవలు అందించాలని ఈ పంచాయతీ ప్రజలు కోరుతున్నారు.

శిథిలావస్థలో కొత్త కొవ్వాడ పశు వైద్యశాల



కూలిన పశు వైద్యశాల ప్రహరీ



శిథిలావస్థలో కొత్త కొవ్వాడ పశు వైద్యశాల భవనం

పద్మనాభం: మండలంలోని కొత్త కొవ్వాడ పశు వైద్యశాల భవనం శిథిలావస్థకు చేరుకుంది. వర్షాలొస్తే కారిపోవడంతో సిబ్బంది, రైతులు ఇబ్బంది పడుతున్నారు. 1999లో నిర్మించిన భవనం బీటలు వారి, శ్లాబ్ పెచ్చులూడిపోయింది. గేట్లు పాడయ్యాయి. మరుగుదొడ్లు మూలకు చేరాయి. ఈ ఆస్పత్రికి గంధవరం, పాత కొవ్వాడ, కొత్త కొవ్వాడ, అనంతవరం, పెంట, దేవరపాలెం, గొల్లలపాలెం, తిమ్మాపురం గ్రామాలకు చెందిన రైతులు తమ పశువులను వైద్యం కోసం ఈ ఆసుపత్రికి తీసుకు వస్తారు. భవనం శిథిలావస్థలో ఉండడంతో వారంతా ఆందోళన చెందుతున్నారు. భవనం ఎప్పుడు కూలిపోతుందోనని కలవరపడుతున్నారు. మరోవైపు ప్రహరీ శిథిలం కావడంతో భవనం రాత్రివేళల్లో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది. పాలకులు, సంబంధిత అధికారులు స్పందించి పశువుల ఆస్పత్రికి కొత్త భవనం నిర్మించాలని పాడిరైతులు కోరుతున్నారు.

డంపింగ్‌యార్డ్‌లా పాఠశాల పరిసరాలు

తగరపువలస: చిట్టివలస జెడ్పీ హైస్కూల్ పరిసర ప్రాంతాలను స్థానికులు డంపింగ్‌యార్డుగా వినియోగించుకుంటున్నారు. ఈ ప్రాంతంలో భవన నిర్మాణాలు చేపట్టేవారు ఇసుక, ఇటుక, మెటల్ తదితర సామగ్రితో పాటు డెబ్రిస్, తొలగించిన చెట్లను తీసుకువచ్చి స్కూల్ గేటు ముందు, ప్రహరీపై పడేస్తున్నారు. గతంలో ఇలాగే లారీల కొద్దీ లోడ్‌లతో మెటీరియల్ వేయడం వలన హైస్కూల్ ప్రహరీ కూలిపోయింది. దీంతో నాడు-నేడు పథకం కింద ఖర్చు చేసిన రూ.లక్షలు ఇక్కడ వృథా అయ్యాయి. ఈ విషయాన్ని సమాచార హక్కు చట్టం ప్రకారం రాబట్టిన టీడీపీ నేతలు స్కూల్ యాజమాన్యాన్ని బ్లాక్‌మెయిల్ చేయడంతో బంగారు ఆభరణాలతో మేనేజ్ చేశారన్న ఆరోపణలు ఉన్నాయి. నాడు-నేడు పనులు చేపట్టి మూడేళ్లయినా కాకమునుపే ఇప్పుడు మిగిలిన భవన నిర్మాణదారులు స్కూల్ ప్రహరీపై డెబ్రిస్ వంటివి వేయడాన్ని పూర్వ విద్యార్థులు తప్పు పడుతున్నారు. పాఠశాల యాజమాన్యం జోక్యం చేసుకుని ఇలాంటివి జరగకుండా చూడాలని కోరుతున్నారు.



చిట్టివలస జెడ్పీ హైస్కూల్ గేటు వద్ద తుప్పలు, డెబ్రిస్

'మిస్సింగ్ కేసులన్నీ ఛేదించాం'



గోవింద్‌తో హెచ్‌సీ శ్రీనివాస్

పీఎం పాలెం: స్థానిక పోలీస్ స్టేషన్ పరిధిలో ఆగస్టు నెలలో నమోదైన 16 మిస్సింగ్ కేసుల్లోని వ్యక్తులను గుర్తించి, వారి కుటుంబాలకు అప్పగించామని పీఎం పాలెం పోలీస్ స్టేషన్ సీఐ వై.రామకృష్ణ తెలిపారు. అందులో చిటికెల గోవింద (39)అనే వ్యక్తి అదృశ్యం కేసును స్థానిక హెడ్ కానిస్టేబుల్ శ్రీను దర్యాప్తు చేయగా, అతనిపై ఎంవీపీ పోలీస్ స్టేషన్‌లో రూ.4 కోట్లు మోసగించినట్టు కేసు నమోదైనట్లు గుర్తించామన్నారు. దీంతో తదుపరి చర్యల నిమిత్తం ఎంవీపీ పోలీస్ స్టేషన్‌కు అప్పగించామన్నారు. 2016లో అదృశ్యం అయిన వారి కేసు రీ ఓపెన్ చేసి అదృశ్యం అయిన ఇద్దరినీ, 2017లో అదృశ్యం అయిన ఒకరి ఆచూకీ కనుగొని వారి కుటుంబాలకు అప్పగించినట్లు సీఐ తెలియజేశారు.